తోడుగా పంపబడ్డ ఆ నలందా విశ్వవిద్యాలయ యువకుడు చేసిన ఆ త్యాగం వల్లే టిబెట్‌కి ఆ పుస్తకాలు చేరి, లామాలు ఆధ్యాత్మికంగా పురోగతిని సాధించగలిగారు.

## 66. మాట తప్పక

ఓ పిసినారి కొడుకు వేలికి ఓ కురుపు లేచింది. ఎన్ని మందులకి అది తగ్గకపోవడంతో అతను తన ఇష్ట దైవం అయిన హనుమంతుడి గుడికి వెళ్ళి మొక్కుకున్నాడు.

"నా కొడుకు వేలు నయం అయితే నీకు వడమాల వేయించి, అప్పాలు చేయించి నైవేద్యం పెడతాను."

వెంటనే ఆ పిల్లవాడు కోలుకున్నాడు. ఐతే ఆ పిసినారి 'ఇప్పటికే వైద్యులకి, మందులకి చాలా ఖర్చు చేసాను. కాబట్టి వడ మాల మానేసి అప్పాలు నైవేద్యం పెట్టి వూరుకుంటాను' అనుకున్నాడు. కాని చూస్తూ, చూస్తూ రెండు వందల ఏభై రూపాయలు పెట్టి అప్పాలని చేయించబుద్ధి కాలేదతనికి. రోజులు వారాలయ్యాయి. అతని భార్య ఓ రోజు అతనికి మొక్కు గురించి గుర్తు చేసింది.

"నేను బీదవాడినని స్వామికి ఎటూ తెలుసు కదా. అదీ కాక స్వామి అప్పాలు తింటాడా ఏమిటి? సగం మనకిచ్చి పూజారి మిగిలినవి భక్తులకి పంచడమే కదా జరిగేది. స్వామికి ఆకు పూజ చేయిస్తాను. తక్కువలో పోతుంది." చెప్పాడు అతను.

"ఆలస్యం చేయకుండా మరి అదైనా చేయండి."

గుడికి వెళ్తూంటే అతని పిసినారి బుర్రలో ఇంకో ఆలోచన మెదిలింది.

'ఆకు పూజకి వంద రూపాయల దాకా ఖర్చవుతుంది. అదే కొబ్బరికాయ కొడితే పది రూపాయలతో పోతుంది.'

గుడి బయట కొబ్బరి కాయలు అమ్మే దుకాణానికి వెళ్ళాడు. దుకాణంవాడు ఒకో కాయ పన్నెండు రూపాయలు చెప్పాడు.

"క్రితం సారి ఎనిమిదికే కొన్నాను."

"నేను కొన్నదే ఎనిమిదికి. రాముడు గారి కొబ్బరి తోటకి వెళ్తే ఆయన మీకూ ఎనిమిదికే ఇస్తారు."

వెంటనే ఆ పిసినారి నాలుగు మైళ్ళ దూరంలోని రాముడి కొబ్బరి తోటకి వెళ్ళాడు. తన సహజ బుద్ధితో బేరం అడాడు.

"కాయ ఆరుకి ఇస్తారా?"

"ఆరుకైతే మీరే పీచు తీసుకోవాలి." చెప్పాడు రాముడు.

"సరే అయితే."

రాముడు ఇచ్చిన కొడవలిని తీసుకుని ఆ పిసినారి కొబ్బరి కాయకి పీచు తీస్తూంటే, అలవాటు లేని పని కాబట్టి కొడవలి దెబ్బ పడి అతని వేలు చితికింది. దాని చికిత్సకి అతనికి అయిదు వందల రూపాయలైంది.

నీతి: మాట ఇవ్వకు. ఇస్తే తప్పకు.

## 67. దేవుడే ఇస్తాడు

హిమాలయాల్లో ఓ మారుమూల గుహలో ఓ యోగి తపస్సు చేసుకుంటున్నాడని తెలిసి ఓ యాత్రికుడు ఆయన్ని వెదుక్కుంటూ వెళ్ళాడు. ఆయన బయటకి రాగానే ఆయన కోసం వేచి వున్న ఆ యాత్రికుడు ఆయన పాదాలకి నమస్కరించి, తనతో తెచ్చిన ఓ గోధుమ పిండి మూటని ఆయనకి ఇచ్చి చెప్పాడు.

"ఇక్కడికి ప్రజలు పెద్దగా రారు. మీరు భోజనానికి ఇబ్బంది పడకూడదని పది రోజులకి సరిపడే దీన్ని తెచ్చాను. దయచేసి స్వీకరించండి."

ఆ యోగి మూట విప్పి ఓ గుప్పెడు పిండి తీసుకుని మళ్ళీ మూటకి యథా ప్రకారం ముడి వేసి దాన్ని అతనికి వెనక్కి ఇచ్చేసాడు.

"ఇవాళ్టికి ఇది చాలు. మిగిలింది నువ్వు తీసుకెళ్ళు." చెప్పాడాయన.

"రేపటికి? ఎల్లుండికి? ఉంచండి స్వామి." కోరాడా భక్తుడు.

"ఇవాళ ఇచ్చిన దేవుడే రేపటికి, ఎల్లుండికి, నేను మరణించే రోజు దాకా ఇస్తాడు." చిరునవ్వుతో చెప్పాడు ఆ యోగి.

దైవం మీద అంతటి విశ్వాసం వున్నవాళ్ళకే దేవుడు సులభంగా చిక్కుతాడు.